సాక్షి
ములుగు

ఆదివారం । 5 । జనవరి । 2025



రాంపూర్ అటవీ ప్రాంతంలో పులి జాడ
కొత్తగూడ మండలం రాంపూర్ గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఫారెస్ట్ అధికారులు పులి అడుగులను గుర్తించారు. - 8లో▸



రహదారులపై రయ్..రయ్
కాలుష్య రహిత (ఎలక్ట్రిక్) బస్సులు ఎట్టకేలకు వరంగల్ రీజియన్ రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28^0/17^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రోడ్డు భద్రతా ప్రమాణాలపై ర్యాలీ నిర్వహించాలి



ములుగు: రోడ్డు భద్రతా ప్రమాణాలపై జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ తర్వాత భారీ అవగాహన ర్యాలీ నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నిర్వహించారు. జిల్లా తరఫున కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, ఆర్డీఓ వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ర్యాలీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను భాగస్వాములు చేయాలన్నారు. రవాణా, పోలీస్, విద్యాశాఖ,, రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో నడుచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు.

సమ్మె విరమించిన సీఆర్‌టీలు



ఏటూరునాగారం: మండల కేంద్రంలో సీఆర్‌టీలు చేపట్టిన సమ్మెను విరమిస్తున్నట్లు గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు రెసిడేన్షియల్ టీచర్స్(సీఆర్‌టీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోదెం రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు సమ్మెను విరమించినట్లు శనివారం లేఖను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న హైదరాబాద్‌లో మంత్రి సీతక్క, ట్రైబల్ కమిషనర్ శరత్ జరిపిన చర్చల్లో భాగంగా సానుకూలంగా హామీలు రావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు. తమ డిమాండ్‌లను పూర్తిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్య రాములు, యాప సంపత్‌కుమార్, భూక్య శ్రీను, జిగట భాస్కర్, సృజన్, పాపారావు, వాణి, లక్ష్మి, పార్వతి, సరిత, సరళ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సునీతకు కృత్రిమ కాలు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కే పురం గ్రామానికి చెందిన దర్రా సునీతకు కొంత కాలం కిందట పాముసూరు గుట్టల సమీపంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఎడమ కాలు పోగొట్టుకుంది. కాగా శనివారం సునీతకు భారతీయ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్టు, వెంకటాపురం పోలీసుల సహకారంతో ఆమెకు కృత్రిమ కాలును అమర్చారు. ఈ మేరకు సునీతకు కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందించడంతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ సునీతకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు, నాయకులు మద్దుకూరి ప్రసాద్, రమేష్, దర్ర రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప సరస్సులోకి గోదావరి జలాలు



వెంకటాపురం(ఎం): దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా భీంఘన్‌పూర్ పంప్‌హౌస్ నుంచి ఒక మోటార్ ద్వారా రామప్ప సరస్సులోకి గోదావరి జలాలను మూడు రోజులుగా అందిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఐబీ డీఈ రవీందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. రామప్ప సరస్సులో నీటిని నిల్వ చేయకుండా రామప్ప నుంచి పాకాల సరస్సుకు పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు, అంతేకాకుండా గణపురం చెరువుతో పాటు రామచంద్రాపురం పరిధిలోని సుమారు 6వేల ఆయకట్టుకు సాగునీటిని అందించనున్నట్లు వెల్లడించారు. 35 అడుగుల నీటి సామర్థ్యం గల రామప్ప సరస్సులో ప్రస్తుతం 29.6 అడుగుల నీటిమట్టం ఉందని తెలిపారు. 30అడుగుల లోపే రామప్ప సరస్సులో దేవాదుల నీటిని నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు పంపింగ్ చేపడుతున్నామన్నారు. రెండు నెలల పాటు గోదావరి జలాల తరలింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. రామప్ప సరస్సు కింద సుమారు 6వేల ఎకరాల యాసంగి సాగుకు నాలుగు రోజుల క్రితం నీటిని విడుదల చేసినట్లు డీఈ వెల్లడించారు.

అతిథులను ఆదరిద్దాం..



కొరియన్ ఫ్లైక్యాచర్

పక్షులు.. పర్యావరణానికి నేస్తాలు. మానవాళికి చుట్టాలు. కిచకిచమని రాగం తీసే సహజ సంగీత పుంగవులు. విశ్వాన్ని గాలించి గడ్డో.. పరకో సేకరించి.. చిన్న గూడునల్లుకునే ఇంజనీర్లు. పురుగూపుట్రా దరిచేరకుండా పంటకు కాపలా కాసే సైనికులు. కిలకిలారావాలతో సందడి చేసే.. ప్రకృతి హితులు. తీరాలు దాటి ఉమ్మడి జిల్లాకు ఎగిరొస్తున్న పక్షులెన్నో.. వీటన్నింటికీ ఓరుగల్లు ఆతిథ్యమిస్తోంది. ఇదే సమయంలో తరిగిపోతున్న అడవులు, పెరుగుతున్న కమ్యూనికేషన్ రంగాల నేపథ్యంలో పక్షుల సంఖ్య తగ్గిపోతోంది. నేడు (ఆదివారం) జాతీయ పక్షుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. **- సాక్షి నెట్‌వర్క్**

విదేశీ, స్వదేశీ పక్షుల విడిది ప్రాంతంగా ఓరుగల్లు

- అనేక జాతుల పక్షులకు ఆవాసంగా పాకాల
- భీమునిపాదం వద్ద అరుదైన కొరియన్ బర్డ్
- సైబీరియన్ కొంగలకు పలు గ్రామాల ఆతిథ్యం
- జీవ వైవిధ్యంలో వీటిది కీలకపాత్ర
- మానవ అవసరాల నేపథ్యంలో తగ్గుతున్న పక్షులు
- వీటిని కాపాడుకుంటేనే ప్రకృతి సమతుల్యత

నేడు జాతీయ పక్షుల దినోత్సవం

భీమునిపాదం వద్ద కొరియన్ ఫ్లైక్యాచర్ గుర్తింపు

గూడూరు: ఎల్లో–రంప్డ్ ఫ్లైక్యాచర్ అని కూడా పిలిచే అరుదైన కొరియన్ ఫ్లైక్యాచర్‌ను గతేడాది ఏప్రిల్‌లో గూడూరు మండలంలోని భీముని పాదం జలపాతం వద్ద గుర్తించారు. అంతుచిక్కని స్వభావానికి పేరుగాంచిన ఈ పక్షిని ప్రభుత్వ ఉద్యోగి, పక్షుల పరిశీలకుడు హరి గోపాలాచారి శ్రీరంగం తన కెమెరాలో బంధించారు. శీతాకాలంలో ఆగ్నేయాసియాకు వలస వెళ్లే ముందు. అదేవిధంగా సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప దట్టమైన అడవిలో ఇటీవల పర్యాటకులకు ఈఅరుదైన పక్షి కనిపించింది. దీని శరీర భాగం పాలపిట్ట మాదిరిగా బ్లూ కలర్‌లో ఉండగా, ముక్కు పొడవుగా ఉందని అటవీశాఖ అధికారి తెలిపారు.



జూపార్కులో కనువిందు చేస్తున్న పక్షులు



న్యూశాయంపేట: వరంగల్ కాకతీయ జూపార్కులో వివిధ రకాల పక్షులు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. మన దగ్గర సంచరించేవి కాక వివిధ ప్రాంతాల్లో ఉండే ఆస్ట్రిచ్(3), వైట్ రేహా బర్డ్స్(3), హంసలు వైట్ అండ్ బ్లాక్(3), పీఫౌల్(పీకాక్స్ 15), వైట్ పీకాక్స్(2), పీషాంట్స్(6), జంగిల్ ఫౌల్స్ (12), పీజియన్స్(45), ప్యారెట్స్(22), లౌ బర్డ్స్(35) సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

కనుమరుగవుతున్న పిచ్చుకలు



తోక పొట్టి.. ముక్కు గట్టి.. ముద్దుగా... బొద్దుగా గోధుమ ఉదా రంగులో ఉండే పిచ్చుకలు ఒకప్పుడు పల్లెల్లో విరివిగా కనిపించేవి. చిన్నచిన్న క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకుని పంటలకు చీడపీడలు తగలకుండా అన్నదాతకు సాయపడతాయి. ఈ పిచ్చుకల్లో దాదాపు 35 జాతులున్నాయి. సెల్యూలర్ టవర్ల నుంచి వెలువడే అయస్కాంత తరంగాలు.. రసాయనాలతో పళ్లు, ఆహార ధాన్యాలు పండించడం వంటివి పిచ్చుకలు కనుమరుగవడానికి కారణాలవుతున్నాయి.

అభయారణ్యంలో..



ఏటూరునాగారం: ములుగు జిల్లాలోని ఏటూరునాగారం అభయారణ్యం.. దట్టమైన అటవీప్రాంతం, వాగులు, వంకలు ఉండడంతో పక్షులకు నిలయంగా మారింది. భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం ప్రాంతాల్లో 122 రకాల పక్షుల ఆనవాళ్లు లభించినట్లు ఓ రీసెర్చ్ స్కాలర్ తెలిపారు.

సండే స్పెషల్

పక్షులతో ప్రకృతికి మేలు



జనగామ: పక్షులు మానవుడికి జీవన గమనం నేర్పుతాయి. వాటిని కాపాడడం మన కర్తవ్యం. వీటిని వ్యవసాయానికి సహజమిత్రులుగా భావిస్తాం. చనిపోయిన చిన్న జీవుల అవశేషాలను తినడం ద్వారా పక్షులు (గద్దలు, రాబందులు) వ్యాపించే రోగాలను తగ్గిస్తాయి. ఇవి పర్యావరణానికి అందాన్ని జోడించి పర్యాటకులను ఆకర్షించి ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి. కానీ, అడవులను నరికి నివాస స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు, ఆహారం కోసం వీటిని వేటాడుతున్నారు. పక్షులను రక్షించడం ప్రకృతికి మేలు చేయడం మాత్రమే కాదు. మన భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను అందించడం.

- తుమ్మ కమలహాసన్, జీవశాస్త్ర విషయ నిపుణుడు

సైబీరియన్ కొంగల విడిది..





మహబూబాబాద్ రూరల్/నెల్లికుదురు/దేవరుప్పుల: మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం, మల్యాల గ్రామాలు, నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి, దేవరుప్పుల మండలం చిన్నమడూరు గ్రామాల్లో సైబీరియన్ కొంగల రాకతో సందడి నెలకొంటుంది. ప్రతీ ఏడాది డిసెంబర్ మాసం చివరి రోజుల్లో, జనవరి మాసం ప్రారంభంలో రావడం ప్రారంభించి స్థానికంగా ఉన్న చెట్లపై గూళ్లు పేర్చుకుని నివాసం ఉంటాయి. గుడ్లుపెట్టి, పొదిగి తమ సంతానాన్ని ఉత్పత్తి చేసుకుంటాయి. కొన్ని ప్రాంతాల్లో జూన్‌లో, మరికొన్ని ప్రాంతాల్లో ఆగస్టు నెలలో తమ సంతతితో స్వస్థలాలకు తిరుగుముఖం పడతాయి.

పాకాల.. స్వదేశీ, విదేశీ పక్షుల పాగా..



ఖానాపురం: సువిశాలమైన అటవీ ప్రాంతం, ఎల్లప్పుడూ నీరు అందుబాటులో ఉండడంతో వరంగల్ జిల్లా ఖానాపురం మండలం పాకాల పరిసరాలు స్వదేశీ, విదేశీ పక్షులకు ఆవాసాలుగా మారుతున్నాయని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు నాగేశ్వర్‌రావు, శ్యాం సుందర్ తెలిపారు. ఆరెంజ్ హెడ్ రాక్ థ్రష్, బ్లాక్ రెడ్ స్టార్ట్, ఎల్లో బ్రౌడ్ బుల్‌బుల్, రాకెట్ టెయిల్డ్ డ్రోంగో, రూఫస్ ట్రిపీ, నల్లని మూపు మోనార్క్, నల్లటి హుడ్ ఒరియోల్ తదితర జాతుల పక్షులు మనకు ఇక్కడ కనిపిస్తాయి.

బాలకార్మిక వ్యవస్థ అనాగరికం

- సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్

ములుగు రూరల్: బాలకార్మిక వ్యవస్థ అనాగరిక చర్య అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకేంద్రంలోని సఖి సమావేశ మందిరంలో ఆపరేషన్ స్మైల్ సమన్వయ సమావేశం జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. బాల్యం ఎంతో అమూల్యమైన దశ అని భవిష్యత్‌ని నిర్ణయించేది బాల్యమేనని వివరించారు. 14 సంవత్సరాల పిల్లలు తప్పని సరిగా బడిలో ఉండాలన్నారు. ఇటుకబట్టీలు, భవన నిర్మాణ రంగం, మిర్చి తోటల్లో బాల కార్మికులు ఉంటే వారిని గుర్తించి చదువుకునేలా చూడాలన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగస్వాములైన సిబ్బందికి న్యాయ సేవాధికార సంస్థ మద్దతు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎఫ్‌సీఎం జడ్జి సౌఖ్య, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ, ఏఎల్‌ఓ వినోద, జేజేబీ సుబాష్, డీపీఓ రమణమూర్తి, మంగపేట, ములుగు ఎస్సైలు సురేష్, ఇమ్మాన్యూయేల్, మౌనిక, డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణవేణి, హరికృష్ణ, సంజీవ, సిబ్బంది జ్యోతి, సుమన్, రాజు, నరేష్, సదయ్య, సీహెచ్‌ఎల్ కోఆర్డినేటర్ నరేష్, సిబ్బంది నాగమణి, చంటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కన్నయ్యలాల్

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- జిల్లా సంక్షేమ అధికారి శిరీష

ములుగు: ఐసీడీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అంకితభావంతో విధులు నిర్వర్తించి జిల్లాకు మంచిపేరును తీసుకురావాలని జిల్లా సంక్షేమ అధికారిణి కూచన శిరీష అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది, ఐటీ వింగ్ కో ఆర్డినేటర్, పోషణ్ అభియాన్ సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా లబ్ధిదారులకు సమగ్రమైన సేవలను అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. వారికి పౌష్టికాహారం అందించడానికి అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని సూచించారు. ఎన్‌హెచ్‌టీఎస్, పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా పోషణ్ అభియాన్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి శిరీష

గడువులోగా ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

- కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పురోగతిపై కలెక్టర్ దివాకర అదనపు కలెక్టర్లు చీమలపాటి మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించేందుకు మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. పీఎం ఆవాస్ యాప్‌లో సర్వేయర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వేను పూర్తియాలని ఆదేశించారు. అంతకు ముందు ఉపాధిహామీ పథకం అమలు తీరుపై మండల ప్రత్యేకాధికారులు, ఏపీడీ, ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమగ్రంగా సమీక్షించారు. నర్సరీలు, వనమహోత్సవం తదితర అంశాలపై అన్ని మండలాల ఎంపీడీఓలు, ఆయా మండలాల్లో సాధించిన లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో సాధించిన లక్ష్యాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఎల్డీఎం, ఏపీడీ, మండల ప్రత్యేకధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, సీసీలు, ఎస్‌బీఎం, టీఏలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోవిందరావుపేట మండలం చల్వాయిలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

రోబోటిక్స్ విద్యతో సృజనాత్మకత పెంపు

ములుగు రూరల్: రోబోటిక్స్ విద్య విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తుందని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాలో సోహం అకాడమి ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకాడమిక్ వారు పలు పాఠశాలల్లో విద్యార్థులకు రోబోటిక్స్ విద్యపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌టీటీ డాటా సంస్థ సీఎస్‌ఆర్ మద్దతుతో 120 మంది శిక్షణ కర్తలు జిల్లాలోని 10పాఠశాలల్లో 1088 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ అందించారని తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలు నేర్చుకున్నారని వివరించారు. విద్యార్థులు ఏడాది పొడవునా ఇన్నోవేషన్ చాలెంజ్‌లలో పాల్గొంటారని తెలిపారు. రోబోటిక్స్ విద్య ద్వారా సమస్యల పరిష్కారం, నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని జాకారం, ములుగు, ఇంచర్ల, బండారుపల్లి గురుకుల పాఠశాలలతో పాటు చల్వాయి, ములుగులోని కేజీబీవీల్లో, జవహర్‌నగర్, చల్వాయి, బండారుపల్లిలోని మోడల్ స్కూళ్లలో రోబోటిక్స్ విద్యపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు శిక్షణ తీసుకున్న విద్యార్థులకు రోబోటిక్స్ కిట్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పాణిని, సైన్స్ అధికారి జయదేవ్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



బండారుపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్

రైతులపై తేనెటీగల దాడి

మంగపేట: మండల పరిధిలోని చెరుపల్లికి చెందిన నలుగురు రైతులపై తేనెటీగలు దాడిచేయడంతో శనివారం గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతులు రాంగాని నరేందర్, బరుపటి నర్సింహారావు, అచ్చె దేవేందర్, నాగబెల్లి అరుణాచారి పొలాల వద్దకు వెళ్లి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో రెడ్డిచెరువు కట్టపై చెట్టుకు ఉన్న తేనె టీగలు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా కుట్టాయి. స్వల్పంగా గాయపడిన అచ్చె దేవేందర్, రాంగాని నరేందర్, బరుపటి నర్సింహారావు స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నారు. అరుణాచారిని తేనెటీగలు తీవ్రంగా కుట్టడంతో కుటుంబ సభ్యులు అతన్ని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బ్లడ్ ఇన్‌ఫెక్షన్ అయిందని మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లాలని సూచించగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. . సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాప్రాయం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

రామప్పలో వీకెండ్ సందడి

- అధికసంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు, విద్యార్థులు



రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హరీష్‌శర్మ, ఉమాశంకర్‌లు పర్యాటకులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. నందీశ్వరుని చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి విద్యార్థులు భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయంలోని పలు శిల్పాల వద్ద గ్రూప్ ఫొటోలు దిగి సందడి చేశారు.



రామప్ప ఆలయంలో పర్యాటకులు, విద్యార్థులు

హుండీ ఆదాయం రూ.7.37లక్షలు



కల్యాణ మండపంలో హుండీల కానుకలను లెక్కిస్తున్న అధికారులు, సేవా భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలోని హుండీల లెక్కింపు ద్వారా రూ.7.37 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రావణం సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరకాల డివిజన్ పరిశీలకులు నందనం కవిత పర్యవేక్షణలో ఆలయంలో ఏర్పాటు చేసిన 8 హుండీల లెక్కింపును శనివారం నిర్వహించారు. 2024 ఆగస్టు 30 నుంచి ఈ నెల 3 వరకు ప్రధానాలయంతో పాటు వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన 8 హుండీలలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ద్వారా రూ.7లక్షల 37వేల 539 ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. అదే విధంగా హుండీలలో 33 అమెరికా డాలర్లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, కైంకర్యం రాఘవాచార్యులు, ముక్కామల రాజశేఖర్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, శేషు, లక్ష్మినారాయణ, సిబ్బంది, మణుగూరు రామాలయం సేవా భక్తబృందం వారు పాల్గొన్నారు.

రహదారులపై రయ్..రయ్

నేడు ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం



- డిప్యూటీ సీఎం, రవాణా శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- గత నెల 18న ప్రారంభించాల్సి ఉండగా వాయిదా
- వరంగల్ రీజియన్‌కు మొత్తం 112 ఈవీ బస్సులు
- అందుబాటులోకి చార్జింగ్ పాయింట్లు


సిద్ధంగా ఉన్న చార్జింగ్ పాయింట్లు

హన్మకొండ: కాలుష్య రహిత (ఎలక్ట్రిక్) బస్సులు ఎట్టకేలకు వరంగల్ రీజియన్ రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. దాదాపు నెల రోజుల క్రితం మంత్రుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు యత్నించారు. కానీ వివిధ కారణాలతో ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. దీంతో ఎలక్ట్రిక్ బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 5న (నేడు) డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీ శాఖమంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖమంత్రి ధనసరి సీతక్క.. ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ వరంగల్ రీజియన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు అధికారులకు మంత్రుల కార్యక్రమంపై స్పష్టత లేదు. చివరకు సాయంత్రం 4 గంటల తర్వాత రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. దీంతో అధికారులు హుటాహుటిన ఈవీ బస్సుల ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం ప్రారంభోత్సవానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా సమయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. హనుమకొండ బాలసముద్రంలోని 'కుడా' మైదానంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. డిసెంబర్ 18న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ప్రారంభించేందుకు సన్నాహాలు చేసినా ఆ కార్యక్రమం రద్దు కావడంతో వాయిదా పడింది. ఆ తర్వాత డిసెంబర్ 26న ప్రారంభించాలని ఆశించినా మంత్రి సమయం లభించలేదు. దీంతో దాదాపు నెల రోజులుగా బస్సులు ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తున్నాయి.

వరంగల్–2 డిపోనకు ఈవీ బస్సులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు రావాల్సిన ఎలక్ట్రిక్ బస్సులను వరంగల్–2 డిపోనకు కేటాయించారు. ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమైన చార్జింగ్ పాయింట్లు, సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయింది. 112 బస్సులకు గాను వరంగల్–2 డిపోలో మొత్తం 21 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా పనులు వేగంగా సాగుతున్నాయి. కాగా, ఇప్పటికే 6 చార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటికి అవసరమై విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ నిర్మాణం వరంగల్–2 డిపోలో పూర్తి చేసుకుంది. 6 పాయింట్ల ద్వారా 30 నుంచి 35 బస్సులు చార్జింగ్ చేసుకోవచ్చు. ఒక్క పాయింట్ ద్వారా రోజుకు 5 బస్సుల వరకు చార్జింగ్ చేసుకోవచ్చు. ఒక్క బస్సు పూర్తి చార్జింగ్ కావడానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ఒక ఫిన్‌తో చార్జింగ్ చేస్తే 2 గంటలు, రెండు పిన్‌లతో చార్జింగ్ చేస్తే గంట సమయం పడుతుంది.

వరంగల్ రీజియన్‌లో తీరనున్న బస్సుల కొరత..

టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు ప్రభుత్వం 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది. ముందు 86 అలాట్ చేయగా ఇటీవల మరో 26 బస్సులు పెంచింది. రీజియన్‌లో కాలం చెల్లిన బస్సులను తొలగించడంతో పాటు మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో కొత్త బస్సుల కేటాయింపులో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెంచింది. దీంతో వరంగల్ రీజియన్‌లో బస్సుల కొరత తీరనుంది. కొత్త రూట్లలోనూ బస్సులు నడిపే అవకాశముంది. ప్రయాణికుల ఆక్యుపెన్సీ అధికంగా ఉన్న రూట్లలో అదనపు బస్సులు నడిపేందుకు కొత్త బస్సులు ఉపకరిస్తాయి.

చేరుకున్న 75 బస్సులు..

వరంగల్ రీజియన్‌కు కేటాయించిన 112 బస్సుల్లో ఇప్పటి వరకు 75 చేరుకున్నాయి. ముందుగా రీజియన్‌కు 86 బస్సులు మాత్రమే అలాట్ చేసింది. ఇటీవల మరో 26 పెంచడంతో వీటి సంఖ్య 112కు పెరిగింది. మొత్తం 112 బస్సుల్లో 19 సూపర్ లగ్జరీ, 18 డీలక్స్, 75 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు 75 రాగా ఇందులో 19 సూపర్ లగ్జరీ, 16 డీలక్స్, 40 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి వీటి రాకతో వరంగల్–2 డిపో కళకళలాడుతోంది. జేబీఎం సంస్థ నిర్వహణలో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తాయి. ఈ మేరకు టీజీఎస్ ఆర్టీసీతో జేబీఎం సంస్థ ఒప్పందం చేసుకుంది. జేబీఎం సంస్థ డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ బాధ్యతను శ్రీ బాలజీ కన్సల్టెన్సీకి అప్పగించింది. ఈ మేరకు కన్సల్టెన్సీ.. డ్రైవర్ల ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తోంది. 112 బస్సులకు 260 మంది డ్రైవర్ల గాను ఇప్పటి వరకు 136 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చింది. వీరితో 50 బస్సులు నడపొచ్చు. అయితే త్వరలో 34 బస్సులు నడిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు జేబీఎం సంస్థ, శ్రీ బాలాజీ కన్సల్టెన్సీ డ్రైవర్లను సిద్ధం చేసింది.

నాన్న.. నేనూ నీ వెంటే..

తండ్రి మృతి చెందిన 12 రోజులకే కుమారుడు కన్నుమూత

- ఒకే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తండ్రి, తనయుడి మృతి
- కుటుంబంలో విషాదఛాయలు


సంపత్ (ఫైల్)


సాయిరాం (ఫైల్)

చెన్నారావుపేట : తండ్రి అంటే ఆ కుమారుడికి చెప్పలేనంత ఇష్టం. కుమారుడంటే ఆ తండ్రికి అంతులేని ప్రేమ. తండ్రి కనిపించకపోతే కుమారుడి నిద్రపట్టదు. కుమారుడు లేకపోతే తండ్రికి ఏమి తోచదు. ఒకరిని విడిచి మరొకరు క్షణం కూడా ఉండరు. ఈ క్రమంలో విధి వక్రీకరించింది. తండ్రి అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. దీంతో 'నాన్న.. నీవు లేకుండా నేను ఉండను.. నీతోనే నేను.. నీ వెంటే నేను' అంటూ కుమారుడు సైతం అనారోగ్యంతో ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చిరుతం సంపత్(48), మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు సాయిరాం(21), శివరాం ఉన్నారు. సంపత్ దామెర మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సిద్దిపేటలోని ఆర్‌వీఎం ఆస్పత్రి చికిత్స పొందుతూ డిసెంబర్ 24న మృతి చెందాడు. ఇదిలా ఉండగా పెద్ద కుమారుడు సాయిరాం కొన్ని నెలలుగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతూ ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో సంపత్ దశదిన కర్మ ఈ నెల 02న పూర్తయింది. దశదిన కర్మ పూర్తయిన రెండు రోజులకు సాయిరాం శనివారం మృతి చెందాడు. దీంతో తండ్రి, తనయులను మరణం కూడా వేరుచేయలేకపోయిందని బంధువులు పేర్కొన్నారు. కాగా, సాయిరాం మగ్దుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం, శివరాం మహబూబాబాద్‌లో పదో తరగతి చదువుతున్నాడు. భర్త, కుమారుడు మృతి చెందడంతో తల్లి మాధవి గుండెలవిసేలా రోదించింది.

తలకొరివి పెట్టి తండ్రి, అన్న రుణం తీర్చుకున్న శివరాం

తండ్రికి పెద్ద కుమారుడు తలకొరివి పెట్టాల్సి ఉంది. అయితే అనారోగ్య కారణంతో సాయిరాం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా చిన్న కుమారుడు శివరాం తండ్రికి పెట్టాడు. 12 రోజుల వ్యవధిలోనే అన్న చనిపోవడంతో అతడికి కూడా తలకొరివి పెట్టి ఇద్దరి రుణం తీర్చుకున్నాడు. ఇది చూసిన వారంతా కన్నీరుమున్నీరుగా విలపించారు.

వ్యవసాయ మోటార్ల అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

- 5 మోటార్లు, బైక్ స్వాధీనం


దొంగల అరెస్ట్ చూపుతున్న గార్లబయ్యారం సీఐ రవికుమార్

గార్ల: వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి 5 మోటార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు గార్లబయ్యారం సీఐ బి. రవికుమార్, ఎస్సై ఎస్‌కె. రియాజ్‌పాషా తెలిపారు. ఈ మేరకు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాదారం గ్రామానికి చెందిన ఈసం రాంబాబు, సీమల వెంకటేశ్వర్లు, ఈసం చుక్కయ్య ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్ప డుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని సేరిపురం సమీపంలో గుగులోత్ కిషన్‌కు చెందిన 2, గుగులోత్ చాంద్‌మల్‌కు చెందిన 3 మోటార్లను ఎత్తుకెళ్తూ పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్నామని నేరం ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి 5 మోటార్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు. కాగా, నిందితులు కారేపల్లి, డోర్నకల్, బయ్యారం మండలాల్లో వ్యవసాయ మోటార్ల చోరీలకు పాల్పడిన ఘటనలో ఇటీవల 18 రోజులు జైలుకెళ్లొచ్చినట్లు సీఐ వెల్లడించారు. సమావేశంలో ఏఎస్సైలు రవీందర్, నూరుద్దీన్, సిబ్బంది తిరుమల్‌రావు, శ్యామ్, స్వప్న, శ్రీను, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్ అటవీ ప్రాంతంలో పులి జాడ

- గుండాల వైపునకు వెళ్లినట్లు గుర్తింపు


పులి అడుగులు ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ విశాల్

కొత్తగూడ: పులి సంచారం కొంత కాలంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలకలం రేపుతున్న విషయం తెలిసిందే. తాజాగా కొత్తగూడ మండలం ఓటాయి నార్త్ బీట్ రాంపూర్ గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో శనివారం జిల్లా అటవీ శాఖ అధికారి విశాల్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు పులి అడుగులను గుర్తించారు. కెమెరాలకు చిక్కకుండా.. మనుషులకు కనిపించకుండా.. సాదు జంతువులపై దాడికి పాల్పడకుండా పులి సంచారం కొనసాగుతోంది. రాంపూర్ అటవీ ప్రాంతంలో పులి ఆనవాళ్లను బట్టి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల వైపునకు వెళ్లినట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో పులి సంచారంపై కొనసాగుతున్న ఉత్కంఠ ముగిసినట్లే అని చర్చ సాగుతోంది. గతంలోనూ ఇదే అటవీ ప్రాంతం నుంచి కిన్నెరసాని అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. ఈసారి అదే తరహాలో వెళ్లి పోయి ఉండొచ్చని ఫారెస్ట్ అధికారులు అంచనా వేస్తున్నారు. అడుగుల ఆధారంగా మగ పులి అయి ఉంటుందని డీఎఫ్ఓ తెలిపారు. ఆయన వెంట ఎఫ్‌డీఓ చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో వజరహత్, కొత్తగూడ రేంజ్ డీఆర్వోలు, ఎఫ్ఎస్వోలు, ఎఫ్‌బీఓలు, క్షేత్ర స్థాయి సిబ్బంది ఉన్నారు.

కొడుకు హత్యతో అనాథైన తండ్రి

- కేన్సర్‌తో భార్య, అనారోగ్యంతో పెద్దకొడుకు మృతి
- ఇంటి నుంచి వెళ్లిన మరుసటి రోజే చిన్నకొడుకు హత్య


మహేందర్‌రెడ్డి (ఫైల్)


రోదిస్తున్న సత్తిరెడ్డి

లింగాలఘణపురం : హైదరాబాద్‌లోని పీర్జాదిగూడ మల్లికార్జుననగర్‌లోని అనురాగ్‌రెడ్డి వర్కింగ్ బాయ్స్ హాస్టల్‌లో శనివారం జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం బండ్లగూడేనికి చెందిన అనిరెడ్డి మహేందర్‌రెడ్డి (36) హత్యకు గురయ్యాడు. ఈ ఘటనతో మహేందర్ రెడ్డి తండ్రి సత్తిరెడ్డి అనాథయ్యాడు. భార్య లక్ష్మి ఎనిమిదేళ్ల క్రితమే కేన్సర్‌తో మృతి చెందగా పెద్ద కొడుకు యాకుబ్‌రెడ్డి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. కూతురు వివాహం చేయగా హైదరాబాద్‌లో ఉంటోంది. మహేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో క్యాబ్ నడిపిస్తూ హాస్టల్‌లో ఉంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో ఫైనాన్స్‌లో తీసుకున్న కారు వాయిదాలు చెల్లించకపోవడంతో కంపెనీ తీసుకెళ్లింది. దీంతో టెంపరరీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పది రోజుల క్రితం స్వగ్రామం బండ్లగూడెం వచ్చిన మహేందర్‌రెడ్డి ఇక్కడే ఉంటున్నాడు. గ్రామంలో ఏమీ పనిలేకపోవడంతో మళ్లీ హైదరాబాద్‌లో కారు నడుపుతానంటూ తండ్రి సత్తిరెడ్డికి చెప్పి ఈ నెల 3న హైదరాబాద్ వెళ్లాడు. వెళ్లిన మరుసటి రోజే హాస్టల్‌లో శనివారం హత్యకు గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. భార్య, పెద్దకొడుకు మృతి చెందగా చిన్నకొడుకైౖ తనకు తోడుగా ఉంటాడని భావించిన తండ్రి సత్తిరెడ్డి.. మహేందర్ రెడ్డి హత్యతో దిక్కులేనివాడయ్యాడు. తనకు కొరివిపెడుతాడని అనుకున్న కొడుక్కే తానే తలకొరివి పెట్టాల్సి వచ్చిందంటూ బోరున విలపించాడు. కాగా, మహేందర్ రెడ్డి హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది.

చర్చిలో చోరీకి పాల్పడిన దొంగ..



నరేశ్ అరెస్ట్ చూపుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

ధర్మసాగర్: మండలంలోని కరుణాపురం చర్చిలో చోరీకి పాల్పడిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాజీపేట మండలం కుమ్మరిగూడేనికి చెందిన కొత్తపల్లి స్వర్ణ డిసెంబర్ 10వ తేదీ నుంచి ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం చర్చిలో ఉంటూ రోజూ ప్రార్థనల్లో పాల్గొంది. ఈ క్రమంలో డిసెంబర్ 30న తన శరీరంపై ఉన్న దాదాపు రూ. 2,22,500 విలువైన బంగారు ఆభరణాలు చర్చిలోని బాత్ రూమ్ గోడపై పెట్టి స్నానం చేసింది. స్నానం చేసిన అనంతరం బయటకు వచ్చి గోడపై పెట్టిన బంగారు ఆభరణాలు చూడగా కనిపించలేదు. దీంతో ఆ చర్చికి వచ్చిన ప్రతీ ఒక్కరిని అడిగినా ఎవరూ తమకు తెలియదని చెప్పారు. ఈ ఘటనపై ఈ నెల 3న ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి ఆ చర్చిలోని వ్యక్తులను విచారించారు. చర్చిలో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన వంకాయలపాటి నరేశ్.. నాలుగు రోజులుగా కనిపించడం లేదని నిర్ధారణకు వచ్చి అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో శనివారం నరేశ్ రాంపూర్ శివారులో తిరుగుతున్నాడనే సమాచారం మేరకు గ్రామం చేరుకుని అదుపులోకి తీసుకుని విచారించారు. బంగారు ఆభరణాలను చోరీ చేశానని ఒప్పుకున్నాడు. దీంతో అతడి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సమావేశంలో ఎస్సై జానీ పాషా, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులపై పీఈటీ అసభ్యకర ప్రవర్తన?

- ప్రిన్సిపాల్‌కు తెలియకుండా గేమ్స్‌కు తీసుకెళ్లిన వ్యాయామ ఉపాధ్యాయుడు

కాటారం: క్రీడల పేరిట ఇతర ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం మత్తులో ఓ పీఈటీ విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన మహాముత్తారం మండలంలో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహాముత్తారం మండలం దొబ్బలపాడు మోడల్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఇటీవల నిర్వహించిన సీఎం కప్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో పాఠశాల పీఈటీ గత నెల 26న ప్రిన్సిపాల్ అనుమతి లేకుండా విద్యార్థినులను రాష్ట్ర స్థాయి పోటీల కోసం హైదరాబాద్ తీసుకెళ్లాడు. ఈ క్రమంలో సదరు పీఈటీ జిల్లాలోని ఓ మండలంలో విధులు నిర్వర్తిస్తున్న మరో పీఈటీతో కలిసి మద్యం సేవించాడు. మత్తులో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దురుసుగా మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు సమాచారం అందించగా ఓ విద్యార్థిని తండ్రి మోడల్ పాఠశాలల అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం తెలిపినట్లు తెలిసింది. దీంతో వెంటనే ఏడీ.. ఘటన గురించి మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడగగా తనకు విద్యార్థినులను తీసుకెళ్లిన విషయం తెలియదని వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం విద్యార్థినులు ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు పూర్తి వివరాలు తెలిపినట్లు సమాచారం. ఘటనపై లిఖిత పూర్వకంగా విద్యార్థినులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ భూక్య రవిని 'సాక్షి' వివరణ కోరగా పీఈటీ తనకు సమాచారం ఇవ్వకుండా విద్యార్థినులను క్రీడల నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారని తెలిపారు. అక్కడ విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసిన విషయం తన దృష్టికి రావడంతో పీఈటీకి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో కూడా పీఈటీపై పలు ఆరోపణలు ఉన్నాయని వీటన్నింటిని ఉన్నతాధికారులకు, ఏజెన్సీ బాధ్యులకు నివేదించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీఈటీపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

అన్నపై తమ్ముడు కత్తితో దాడి

- ఆస్తి తగాదాలే కారణం..


గాయపడిన చిరంజీవి

వరంగల్ : ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నపై తమ్ముడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం రాత్రి వరంగల్‌లోని బందెలిశెట్టి వీధి సమీపంలో జరిగింది. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ కథనం ప్రకారం.. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని 90గజాల స్థలాన్ని ఐలోని పాపయ్య తన చిన్న కుమారులు శ్రీనివాస్, శంకర్‌కు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశాడు. ఈవిషయం తెలిసిన పెద్ద కుమారుడు చిరంజీవి.. తమ్ముళ్లకు ఎందుకు రిజిస్ట్రేషన్ చేశావని తండ్రిని ప్రశ్నిస్తున్నాడు. ఈ సమయంలో కోపోద్రేకుడైన శంకర్ తన అన్న చిరంజీవిపై కత్తితో దాడికి పాల్పడాడు. ఈ ఘటనలో చిరంజీవికి తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. చిరంజీవి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకుర్ పేర్కొన్నారు.

వృత్తి ల్యాబ్ టెక్నీషియన్.. ప్రవృత్తి చోరీలు

- అంతర్ జిల్లా దొంగ అరెస్ట్
- రూ.18 లక్షల విలువైన సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంక్రైం: ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తున్న ఓ వ్యక్తి విలాసవంత జీవితానికి అలవాటు పడి చోరీలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఈక్రమంలో ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలతోపాటు హైదరాబాద్‌లో చోరీలకు పాల్పడ్డాడు. ఈ నిందితుడిని శనివారం ఖమ్మం పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన భారీ చోరీపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలను ఖమ్మం ఏసీపీ రమణమూర్తి వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నల్లగుడి తండాకు చెందిన గుగులోత్ నవీన్ ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తూ విలాసవంత జీవితానికి అలవాటు పడ్డాడు. తనకు వచ్చే వేతనం సరిపోకపోవడంతో 2016 నుంచి చోరీలు మొదలుపెట్టాడు. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో ఇప్పటికే కేసులు నమోదవ్వగా, హనుమకొండలో గత డిసెంబర్‌లో చోరీకి పాల్పడి అక్కడి పోలీసులకు చిక్కకుండా ఖమ్మం చేరుకున్నాడు. ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపాన ఇళ్లలో రెక్కీ చేస్తూ అక్కడి ఎస్ఆర్‌సీ టవర్స్‌లో పరిశీలించగా 4వ ఫ్లోర్‌లోని సింగరేణి ఉద్యోగికి చెందిన ఫ్లాట్ తాళం వేసినట్లు గుర్తించాడు. ఆ అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో గతనెల 20న అర్ధరాత్రి వేళ చొరబడి బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. యజమాని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఖమ్మం టూటౌన్, సీసీఎస్ పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపడుతూ నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.18లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐ బాలకృష్ణ, ఉద్యోగులు గజేంద్ర, మంగీలాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు..

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

- కోనంపేటలో ఘటన

కాటారం: మద్యం తాగొద్దని కుటుంబీకులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోనంపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిడెం భాగ్య(39)కు భర్త శ్రీను, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన భాగ్యను.. తాగొద్దని కుటుంబీకులు పలుమార్లు వారించారు. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన వ్యవసాయ పనులకు వెళ్లిన భాగ్య.. అక్కడ మద్యం తాగి ఇంటికి రాగా భర్త శ్రీను, కుమారుడు ఉదయ్‌కిరణ్ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన భాగ్య శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తల్లి మడప లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.